
# వెదుకులాట

ఎ. అప్పల్నాయుడు



“వారం రోజుల్నించే... సావిత్రమ్మకి నిద్రా, హారాల్లేవు. తమరొచ్చి, యేదేనా తరుణోపాయం చూడాలి..”

రామ్మూర్తి గొంతు విషాదంగా పలికింది.

ఇంట్లోంచి - అర్ధరాత్రి పరారయ్యాడట! ఏదో పనిమీద, ఎక్కడికో వెళ్లి వుంటాడని రెండ్రోజులు ఎదురు చూసేరట. మూడో రోజు నుంచే - బంధువుల ఇళ్లూ, స్నేహితుల ఇళ్లూ వాకబు చేయటం ఆరంభించేరట!

రామ్మూర్తి చెప్తోంటే - నాకు సర్వేంద్రియాలూ స్తంభించినట్లయింది. జనార్ధన్ పరారయ్యాడా? అంతటి సమస్యలున్నాయా? అయినా సమస్యల నుంచి పరారయ్యే తత్వం కాదే - జనార్ధనది.

“సమస్య గర్భంలోనే - పరిష్కార మార్గమూ వుంటుంది. దాని కోసం వెదుకులాడాలి” అని చెప్పే జనార్ధన్ పరారయ్యేడంటే - నాకు నమ్మబుద్ధి కావడం లేదు.

“...మీరు బదిలీ అయి, ఇటొచ్చేసేక, జనార్ధనం బాబుల - అంతకు మునుపంత చురుకుదనం వుండేది కాదు. ఏదో పోయిన మనిషిలాగా, పోయినదేదో - వెదుకుతున్నట్టు - తిరిగేవోడు. అలాగనీ, బాధా, కష్టం.. బయటికి చెప్పేవోడు కాదు. మరిదేటో.. ఇలాగ...?” మాటల్ని ముగించలేకపోయేడు రామ్మూర్తి.

బాధలనేవి - బయటికి కన్పించేవీ, చెప్పుకునేవి మాత్రమేనా? మనసులోనివో..? అంతర్, బాహిర్ సమస్యలన్నిటికీ కార్య, కారణాల వెదుకులాట ఎన్ని తరాలుగా జరుగుతోంది! ఎన్ని తత్వాలు.. ఈ విషయం విశదీకరణ కోసం.. రూపుదిద్దాయో గదా! నా ఆలోచనలను.. ఏమీ గమనించని రామ్మూర్తి -

“తమరొస్తే - ఆ తల్లికి ఊరట..” బ్రతిమాలేడు. నేనూ, మరో ఆలోచన లేకుండా, అలాగే బయల్దేరాను రామ్మూర్తి వెంట!

తొలిసారిగా - ఆ ఊరిలోకి జనార్ధన్ వెంట నడిచేను. ఎత్తయిన తూర్పు ముఠా కొండల దిగువ - నాగావళీ నదీ తీర గ్రామం.

“..మా ఊరు అటు కొండలకు, ఇటు పల్లానికీ బోర్దరు! ఈ ఊరు ఆ కొండల మీద ఎగిరిన ఎర్ర జెండాలనూ చూసింది. పేలిన తుపాకీల శబ్దాలనూ విన్నది. ఎన్నింటికో.. సాక్షీభూతం... మా ఊరు..” జనార్ధన్ గొంతులో ..ఏదో దుఃఖపు పొర! కాసేపు మాట్లాడలేకపోయేడు.

భూమి కంపిస్తే - దాని ప్రభావం చాలా దూరం వుంటుంది. అలా, ఆ కొండల మీది కంపనానికి - ఈ ఊరూ గురయ్యింది. ఊరు... పోలీసుల సోదాలకు గురయ్యేది. నిద్రలో ఉలిక్కిపడ్డట్టు.. పోలీసు జీపుల శబ్దాలకు - ఊరు త్రుళ్లిపడేది. గ్రహణం వేళ.. కకావికలైన పక్షులయ్యే వాళ్లు.. ఊరిలో జనాలు! మండిన కొండలకు సాయపడ్తున్నాడని - జనార్ధన్ తండ్రిని చెరసాలలో పెట్టారు.

“..ఇప్పుడవన్నీ గత గాధలులెండి. గవర్నమెంట్ ఇప్పుడు కొండల మీదికి - సంక్షేమాన్ని సరఫరా చేస్తుంది. కొండలూ.. కొంత చల్లబడ్డాయి. అయితే, అప్పుడూ ఇప్పుడూ మా సమస్యలు మావి.

మా ఊరికి రహదారి లేదు. పాఠశాల లేదు. నాగావళి నది వున్నా, మా పొలాలకి నీటి వసతి లేదు. ఇదిగో, ఈ సమస్యలు తీరే దారి కోసరం.. వెదుకులాడుతున్నాం..” జనార్ధన్, తొలిసారిగా నాతో పలికిన మాటలవి!

రామ్మూర్తీ, నేనూ ఊరు చేరుకున్నాం. ఊరు పెద్దగా మారలేదు. రోజ్‌గార్ రహదారీ, బలహీన వర్గాల కాలనీ, పాఠశాల భవనమూ, కొత్తగా కన్పించిన మార్పులు!

అల్లంత దూరాన్నించే నన్ను చూసి - జనార్ధన్ తల్లి ఏడుపు అందుకుంది. సావిత్రి - నిల్చున్న శోక దేవతలా వుంది. ఇరుగూ, పొరుగూ నన్ను చూసి - వచ్చేరు.

అల్లంత దూరాన్నించే నన్ను చూసి - జనార్ధన్ తల్లి ఏడుపు అందుకుంది. సావిత్రి - నిల్చున్న శోక దేవతలా వుంది. ఇరుగూ, పొరుగూ నన్ను చూసి - వచ్చేరు.

“..నాయినా, నా బిడ్డ.. నీ నేస్తం.. యేడీ? ఎక్కడికి మాయమయిపోనాడు? నా బిడ్డడ్ని.. నాకు సూపించవా?” నా చేతులు పట్టుకు ఏడుస్తోంది ముసలమ్మ.

“..ఎందుకిలగ చేసేరో బోధపడ్లేదు. ఇలాగ, నడిమధ్యల మమ్మల్ని వొగ్గేస్తే.. మాకు దారేటి?” సావిత్రి గొంతులో దైన్యం ప్రవహించింది.

ఊరి గురించీ, జనం గురించీ, వారి బ్రతుకు దారి గురించీ ఆలోచించే జనార్ధన్ - తన కుటుంబాన్ని దారి మధ్యలో వొదిలేసి పోతాడా? అర్ధరాత్రి పూట.. ఏ తాత్త్విక చింతనతో - ఎటుపోయినావోయ్.. గౌతముడా? నా మనసు ఆక్రోశిస్తోంది.

ముసలమ్మనూ, సావిత్రినీ ఎలా ఓదార్చాలో నాకు తోచటం లేదు. నన్నూ, నా కుటుంబాన్నీ.. ఎన్నో సార్లు ఓదార్చేడు జనార్ధన్. నాకవన్నీ గుర్తులోకొస్తున్నాయి..

నేను, ఆ ఊరు వొచ్చిన్నాడు కలిసిన జనార్ధన్ స్నేహం, ఊరిలో గడిపిన జీవితం.. సాగునీటి కోసం నుండి సారా నిషేధం దాకా నడిచిన ఉద్యమాలు.. గుర్తొస్తున్నాయి.

ఆ ఊరిలో వున్నప్పుడే నా పెద్ద కూతురికి పెళ్లిచేశాను. కొడుకుని - టీచర్ ట్రైనింగ్‌కి పంపేను. పదేళ్లకు పైగా ఆ ఊరిలో - కష్టాలూ, సుఖాలూ రెండూ అనుభవించేను. కష్టాల్లో నాకు అండగా నిల్చున్నది జనార్ధనే..

అల్లారుముద్దుగా పెంచుకున్న కూతుర్ని, అల్లుడి కాళ్లు కడిగి కన్యాదానం చేసినపుడు.. నా కన్నీరు తుడిచేడు జనార్ధన్. ఆ తర్వాత, కూతుర్ని తండ్రినైన నాకంటే ఎక్కువగా ఆదుకున్నాడు.

ఆరోజు...!

ఒక చేత్తో సూట్‌కేసూ, మరో చేత్తో చంటి పాపనూ ఎత్తుకొని... నా పెద్ద కూతురు.. ఏడుస్తూ ఇల్లు చేరింది.

"తిట్టినా, కొట్టినా భరించేను. కోరినవన్నీ... మిమ్మల్ని ఒడించి తీసుకెళ్ళాను. అతను మనిషి కాదు.. జంతువు! మరో కాపురం పెట్టాడు... అటువంటి వాడితో ఇక కాపురం చెయ్యలేను..."

కూతురు ఆక్రోశాన్ని నాకంటే, ఆర్తిగా విన్నది జనార్ధనే.

"మంచి పని చేశావ్. ఆ పశువితో ... తెంపుకొని వొచ్చేవ్. నీకేం ఫర్లేదు.. నీనున్నానమ్మా..." అని ధైర్యం చెప్పి; ఒక టైలరింగ్ మిషన్, బ్యాంకు ద్వారా అమర్చి - అమ్మాయికి బ్రతుకుదారి చూపేడు.

"శ్రీకాకోళం దగ్గిర ఏదో వలసట! సిద్ధాంతి బాబున్నాడట. అతగాడు - వరారయినోలి ఆచూకీ చెప్తాడట నాయినా..." మసలమ్మ, ఏడుపు ఆపి; చెప్పింది ఆశగా.

"ఆ సిద్ధాంతి కాడకి - గొప్ప, గొప్పోలు వొస్తంతారట..." పొరుగింటామె, కాస్త వివరించబోయింది.

"నీకు తెల్దుగావాల.. ఎంపీ గోరు నామినేషన్ యెయ్యడానికి, మూర్తం.. ఆ సిద్ధాంతి గోరే పెట్టేరు. తిరుగులేదు. అతగాని వాక్కుకి.." రామ్మూర్తి అతిశయోక్తుల్ని పేర్చాడు.

"యేవెవో, యే పుట్టలో యే పాముందో? ప్రయత్నం చేస్తే నష్టం లేదని.." సావిత్రి సంశయంగా నావైపు చూస్తూ-

నా యిష్టాయిష్టాల ప్రమేయం లేకుండా - సిద్ధాంతిగారి దర్శనం కోసం బయల్దేరాను. తోడుగా రామ్మూర్తి. దాదాపుగా మూడు గంటల బస్సు ప్రయాణం. జనార్ధన కోసం - ఈ విధమైన వెదుకులాట - అపసవ్యంగా వుంది మనసులో.

**నేను, ఆ ఊరిలో వుండే నాటికి -జనార్ధన్ సన్నకారు రైతు పూటుతో వుండేవాడు. నా కూతురి వయసు కొడుకూ, తర్వాత ఇద్దరు కూతుళ్లా సంతానం. నేల బుగ్గి నెత్తిన బోసుకునేట్టు కష్టపడేవాడు. చెమట చుక్క మీద తప్పా, మరే శక్తి మీదా విశ్వాసం లేదు జనార్ధన్‌కి.**

"ఔనూ జనార్ధన్ వరకట్టిన భూమి తాలూకా గొడవ తేలిందా?" అనడిగేను రామ్మూర్తిని.. ఆ విషయం గుర్తొచ్చి.

"..ఎక్కడ తేలింది? ఆ గొడవకి మరికొన్ని జతయినాయిగానీ. అయినా, ఆ బాబు బెదరలేదు, అదరలేదు.." చెప్పాడు రామ్మూర్తి.

నిజవేం. జనార్ధన యేటికి యెదురీదేడు.

జైలు నుంచి విడుదలయిన జనార్ధన తండ్రి - రకరకాల రోగాలతో తీసి తీసి చనిపోయేడు. తండ్రి చనిపోతూ అప్పజెప్పిన ఆస్తి - ఎకరా మెట్టు, అర ఎకరా పల్లమూ! ఆ మెట్లక్కి ఆనించి, కొర్నుగా మిగిలిపోయిన ఎకరా బంజరూ!

ఆ బంజరునేలనీ, మెట్ట భూమినీ వరకట్టి, చదును చేసి - ఉన్న పల్లపు భూమిలో కలిపితే, ఏ బ్యాంకు రుణం ద్వారానో - నుయ్యీ, ఆయిల్ ఇంజనూ అమర్చితే - పంటలకి గ్యారంటీ వుంటుందనీ; బ్రతుక్కి ధోకా వుండదనీ ఆశపడ్డాడు.

బంజరు నేల మీది మొక్కా మోడూ నరికి, తగులబెట్టాడు. మిట్టవల్లాల్ని దవ్వి, నొల్లదోలి, చదును చేశాడు. కూలీలూ, పశువులూ ఒక పంతు శ్రమిస్తే, జనార్ధన్ ఒక్కడే వారి ధీటుగా ఒకవంతు శ్రమించేడు. తన శ్రమతో బంజరు నేల రూపాన్నే మార్చేసిన జనార్ధన్, ఆ భూమి దగ్గరకు నన్ను తీసుకువెళ్లి-

".. యిదిగిది చూడండి. ఇక్కడ నా చెమట ఇంకింది. ఇక్కడ నా రెక్కలు ముక్కలయినాయి. ఇక చూస్కోండి - ఇందలి బంగారం పండిస్తాను..." అని ఆనందంగా చెప్పాడు.

అయితే, ఆ ఆనందం - మేము ఇంటికొచ్చేక మిగల్లేదు. జనార్ధన్ వరకట్టిన బంజరు భూమి - జగ్గునాయుడు బుగత జిరాయితీ భూమి అనీ; అక్రమంగా వరకట్టినందుకు శిక్షాపాత్రుడవనీ - రెవెన్యూ వారి నుండి నోటీసు వచ్చింది. ఆ మరునాడు.. పోలీస్ ఠాణా నుండి పిలుపొచ్చింది. గింజ, గింజా కోసం.. మన్ను... మోసి, మోసీ పుట్టలు బెట్టే చీమల్ని - పుట్ట అక్రమంగా గట్టినందుకు చట్టాల పాములు బుసగొట్టినట్లన్పించింది!

జనార్ధన్ - కోర్టులూ, ఆఫీసులూ, పోలీస్ ఠాణాలూ ఎక్కి దిగేడు. ఆ సందర్భంలోనే - నాకు బదిలీ.

"... మీరెలిపోయిన్నాటికి, ఆ భూమి గొడవ అలాగుందా? అంతలోకి - కూతురి పెళ్లికి అరెకరా... అమ్మీ వొలసొచ్చింది.ఆ తర్వాత, కొడుకు... ప్రయోజకుడయి ఆదుకొంటాడనుకుంతే -కొడుకు బతుకు.. కొల్లేరయి పోయింది.." జనార్ధన్‌కి తగిలిన యెదురు దెబ్బల్ని చెప్పేడు రామ్మూర్తి.

"..కొడుకు బ్రతుకేమైందీ?" ఆందోళనగా అడిగేను.

"యేటి సెప్పమంతావు బావ్. కుర్రోడు.. ఐటిఐ ట్రెయినింగ్ అయిపోనాడు గదా? పట్నాల్లంట ఫేక్టరీలకి - నౌకరి కోసం... సెడ్డ తిరిగీ వోడు. ఈ యాతనల తిరుగుతున్నపుడు - తెరవలి ఫేక్టరి కాడ వొకడు కుర్రోడికి తగిలేడట. ఫేక్టరీల నౌకరీ ఇప్పిస్తాను - మూడు వేలు నచ్చుచెప్పీ; పుస్తెల తాడు వొట్టుకోని యెల్లేడట! పుస్తెలతాడు అమ్మీసి, సొమ్ము... బ్రోకరు గోడి చేతిలో బెట్టేడట. ఆడు, ఇలాంటి యవ్వారాల్ల ఆరితేరినోడు నాగుంది. ఫేక్టరీ లోపలికి తీసికెళ్లి; గేరేజ్ దగ్గిర.. ఏదో మిసను సూపించి - దీన్ని పని చేయించు. టైము ఆఫీసుల నీ పేరు రాపిస్తానని సెప్పి - వొచ్చీసినాడట! ఆ తరాత, మన కుర్రోడ్ని ఫేక్టరీ వోళ్లెవరో, భోగట్టా అడగటం; అప్పుడు జరిగిన మోసం మనోడు క్రయించడం అయ్యిందట. ఆకరికి, తల యేలాడేసుకొని, కుర్రోడు - ఆ మర్నాడు రాయిపూర్ పాసింజర్‌ల - తిరుగు ప్రయాణమయిపోనాడట! శని దేవత - కుర్రోడి నెత్తి మీద వుంది. అందికే.. అలగ జరిగింది..." రామ్మూర్తి...ఊపిరి తీసుకోవడానికి మాటల్ని ఆపేడు.

"యేమైంది? యేదేనా ఏక్సిటేంటా? ఆత్మహత్యా..." గొంతు దాటలేదు... నా ప్రశ్నలు!

"...మన కుర్రోడు వొస్తన్న బండిలే ఆ బోకరు గాడున్నాడట! పోనీ, వున్నోడు... అన్ని భోగీలున్నాయి! మరొక భోగీలుండగూడదా? శనీ.. శనీ! మనోడి భోగీలే వున్నాడు. కుర్రోడి... కళ్ల బడ్డాడు. అంతే.. కోపం ఆపుకోలేక ఆడి మీద కలబడ్డాడు. ఇద్దరూ కిందా, మీదా బడి - వొకల్నొకలు కొట్టుకున్నారట! ఆ కొట్లాటల - ఆ బోకరుగోడు - భోగీలోంచి కిందకి జారిపోనాడట...! ఎవురో చెయిను లాగి, రైలాపీసినారట! మర్డర్ కేసు మీద - కుర్రోడ్ని జెయిలుక్కట్టీసేరు! అప్పుడేనా - జనార్ధనం బాబు... గుండె ధైర్యం వొగ్గలేదు. ఎదిగొచ్చిన కొడుకు పీకకి - మర్డర్ కేసు తగిల్నే.. అదరలేదు. నా కొడుకు నేరం సెయ్యిలేదు..! నిర్దోషిగా విడుదలవుతాడనీవోడు!" "రామ్మూర్తి, గొంతు జీరబోతోంది. కాసేపు మాటలాపేడు.

ఇంతలో, ప్రక్క సీట్లో కూర్చున్న వ్యక్తి, రామ్మూర్తి వైపు చూస్తూ -

"యెక్కడికేటి?" అనడిగేడు.

రామ్మూర్తి చెప్పాడు. ఆ తర్వాత అతన్ని - "నువ్వో?" అనడిగేడు.

"వతనకే..." అన్నాడు ఆ వ్యక్తి. అంటే, యెక్కడికో నాకర్ధం కాలేదు. రామ్మూర్తి నడిగితే చెప్పాడు - వతనికే అంటే బస్సు ఆఖరి స్టాపు కని అర్ధమట!

ఆ తర్వాత, ఆ వ్యక్తి అలా కూర్చునే... గురక తీయసాగేడు. యెంతలో, ఎంత తేలిగ్గా నిద్రలోకి వెళ్ళిపోయేడు..! నిద్రరాని రాత్రుల్ని గడిపే నాకు - ఆ వ్యక్తి విచిత్రంగా కన్పించేడు.

"బావూ... రైతోడికి భార్యా బిడ్డలకంటే - గోడ్నా గోదా మీద మమకార మెక్కువంతారు. జనార్ధనం బాబుకీ అంతే! ఆ వొరకట్టిన భూమ్మీద మమకారం... మరిదేని మీద లేదు.

దురదృష్టవొంతుడికి - దేని మీద మమకారముంతే - అదే అందకుండా


**చర్మపు మచ్చలు + కొత్త అన్వేషణ**

**ప్యాచ్‌క్యూర్ వైద్యము** **మచ్చలు పోగొట్టు తేలిక మార్గము**

ప్యాచ్‌క్యూర్‌వైద్యము - సంవత్సరాలుగా పరిశోధించి ఎక్స్‌పెరిమెంట్లు మరియు టెస్టులు చేసి నాణ్యత గుర్తించిన తర్వాత రకరకములైన రంగుల మచ్చలుగల అనేకమందిపై 2 నుండి 8 వారములు ప్రయోగించటమైనది. ప్రయోగముచే రంగుమారుట, మచ్చలు పోగొట్టబడి అసలు చర్మము రంగులోనికి మారుట లాంటి అద్భుతమైన గుణములు రికార్డు చేయటమైనది. దీని సరాసరి ప్రభావము చర్మము మరియు రంగును గ్రహించు కణాలపై ఉండుటచే ప్రయోగము మొదలైన వెంటనే ప్రభావము కనబడును మరియు ఏరంగు మచ్చలైననూ తేలికగా తొందరలో మానగలవు. ఎరుపు, నలుపు, తెలుపు లేక ఏ ఇతర రంగు మచ్చలచేనైననూ బాధపడువారు కేవలము 15 దినములు మాత్రమే ఉపయోగించండి మరియు తీక్షణమైన ప్రభావమును చూడండి. పొందుటకు :- వయస్సు, మచ్చరంగు మరియు ఏ భాగముపైనున్నదీ వ్రాసివంపుట తప్పనిసరి.

**NATH AYURVEDASHRAM (A-4), P.O.KATRI SARAI (GAYA) 805105**

పోతాదట!" కర్మ సిద్ధాంతం వంటబట్టిన రామ్మూర్తి చెప్పుకపోతున్నాడు.

"...జగ్గ నాయుడు బుగత - జెరాయితీ అని గదా కోర్టు పేచీ యెట్టేడు. కోర్టు తేల్చకముందే - అతగాను ఆ భూమిల టాక్టరు దిప్పి; గట్టు కలిపేసి... చుట్టూ... టేకు మొక్కలు నాటించేడొకరోజు! అతగాడికి... అడ్డ లేదు. అంగబలమూ, ఆర్థిక బలమూ వున్నోడు.

మరి, జనార్ధనం బాబు - యేటి తలపోసేడో? అదిగో, ఆ రోజు రాత్రే మాయమయి పోయేడు.

*జగ్గనాయుడు బుగత మీదకి యెళ్లబోతే ఆ బుగతే చంపేసి, శవాన్ని మాయం జేసుంతాడంటారు కొందరు! కొడుకు కోసం బెంగ, భూమికోసం బెంగ, బతుక్కోసం బెంగ! ఇన్ని బెంగల్తోటి విచ్చోదయిపోయి, యెటో వెళ్ళిపోయేడంటారు కొందరు. అదీ, ఇదీ కాదు - అడివిలోకి యెలిపోయేడంటారు కొందరూ! మరి... సిద్ధాంతి బాబు యేటంతాడో..? రామ్మూర్తి ప్రశ్న వేళకు - మా స్టేజి వచ్చేసింది. బస్ దిగి, సిద్ధాంతిగారి ఆశ్రమం వైపు నడిచేం. మధ్యాహ్నం భోజనాల వేళదాటిపోయింది. ఆశ్రమంలో యెక్కువ మంది జనమే వున్నారు. ఆడా, మగా... అన్ని వయసుల వాళ్లూ..! అందరూ, తెలీని బరువేదో శిరస్సుల మీద మోసే వాళ్లలా - అలసటగా వున్నారు.*

పట్టు పంచె, జరీ కండువా ధరించి, విభూది రేఖలు నుదుటి మీద దిద్దుకుని, ఎత్తయిన ఆసనం మీద కూర్చుని వున్నారు సిద్ధాంతిగారు. వారికి, కాస్త దిగువగా పాతకాలపు చెక్కపెట్టె ముందు ఒక యువకుడు కూర్చుని - సిద్ధాంతి చెప్పిన జాతక రేఖలను - చక, చక రాస్తున్నాడు.

ఒక ముసలావిడ, మనుమరాలిని తీసుకొని, సిద్ధాంతి ముందుకు వెళ్లింది. వారిరువురునీ చూసి, సిద్ధాంతి ఓ క్షణం కళ్లు మూసి, యేవో శ్లోకాలు వల్లించి -

".. ఏల్నాటి శని పట్టింది. పిల్లకి - జాతకంలో ముందు, ముందు మంచి దశలున్నాయి. ఇపుడు మాత్రం ఏల్నాటి శని పట్టింది.." అన్నారు కళ్లు మూసుకొనే.

"...దీని పెనిమిటీ అదే అంటన్నాడు బావూ..." అంది ముసలామె.

"..పెనిమిటే... యేల్నాటి శని! యేరేగా, ఇంకే శనీ లేదు...నన్ను వట్టీసి" అంది మనుమరాలు!

సిద్ధాంతి, కళ్లు తెరిచి, మనుమరాలివైపు చూసేరు. ఆ చూపుకు ముసలామె భయపడి పోయి -

"..యిదిగిదే పేలావన బావూ! కట్టుకున్నోడితోటే సక్యం లేదు, కన్న వోళ్లతోటీ నక్యం లేదు..." అని, సంజాయిషీ ఇచ్చుకొని, మనుమరాలిని గదమాయించింది.

సిద్ధాంతి గారి ముందు కూర్చున్న యువకుడు - శనిపూజా విధానమూ, చెల్లించాల్సిన దక్షిణా రాసిన కాగితం అందించేడు ముసలమ్మకు.

ఆ తర్వాత, తండ్రీ కొడుకులు - సిద్ధాంతి యెదుటకు వచ్చేరు.

".. ఇంటర్మీడియెట్ యినమాటు తప్పోయేడు. ఈడికేదో దారి సూవండి బాబూ.." కొడుకు గురించి, వేడుకున్నాడు తండ్రి.

"...అందరికీ ప్రభుత్వ నౌకరీ దారి కావాలంటే యెలా? అసలు, ఆ స్థానంలో శని మహారాజున్నాడు. నౌకరీలు దొరకవు. ఒక వని చేయ్. నా శిష్యుడొకడు - ఐటిఐ సంస్థ పెట్టాడు. నేను ఉత్తరమిస్తాను. అబ్బాయిని అక్కడ చేర్పించు. ఏదో ట్రేడ్‌ల ట్రెనింగ్ అయితే - యే ప్రైవేట్ కంపెనీలో నయినా - దారి దొరుకుతుంది.." చెప్పారు.

తండ్రీ, కొడుకులూ నంబరవడి పోయేరు.

తర్వాత, మరెవరో... గృహ బాధలు వెళ్లబోసేరు.

ఆర్థిక కారణాల్తో శిథిలమవుతోన్న మానవ సంబంధాల వెదుకులాటలో - దారి తప్పిన అనేకులకు - సిద్ధాంతి గారు తోచిన వరిష్కారమూ, ఆధ్యాత్మిక చింతనా, లౌక్యమూ కలగలిపి ఊరడింపు కలిగిస్తున్నారు.

సిద్ధాంతి గారి ఆశ్రమం ముందరి సాలలో - ఓ ఆవుదూడ అదే వనిగా అరుస్తోంది. సిద్ధాంతి - ఆ దూడ అరుస్తున్నపుడల్లా.. ఆ వైపు చూడటం - మొహం ముడుచుకోవటం నేను గమనిస్తూనే వున్నాను. నేను, ఉబుసుబోక - దూడ దగ్గరకు వెళ్లి... దాన్ని చేత్తో దువ్వేను.

"దాని తల్లి తప్పోయింది బాబూ! రెండ్రోజుల నుంచీ అగువడలేదు.." సిద్ధాంతిగారి పాలేరు చెప్పాడు.

"ఒరే కన్నయ్యా... ఆ దూడకి - కాసిన్ని గెంజినీళ్లయినా పెట్టరా..." ఆశ్రమంలోంచి సిద్ధాంతిగారు కేకేసారు.

"ఆవు జాడ... సిద్ధాంతిగారు చెప్పలేకపోయేరా? ఎందరి జాడలో చెప్పగలడంటారు...?" అసంకల్పితంగానే ప్రశ్నించేను.

".. ఆ బాబు - మళ్లా కేకేస్తే బాగోదు..." అంటూ గెంజినీళ్ల కోసం వెళిపోయేడు పాలేరు.

**ఇంతలో మా వంతు వచ్చింది. నేనూ, రామ్మూర్తి - సిద్ధాంతిగారి యెదుట కూర్చున్నాం. రామ్మూర్తి... చేతులు జోడించి, విషయం చెప్పాడు. అటువైపు, సాలలో దూడ అరుస్తూనే వుంది.**

***"..జాతక చక్రం వరిశీలనకు దొరకటం లేదు. తప్పిపోయిన వారి బంధువులు వచ్చేరా?" ప్రశ్నించేరు సిద్ధాంతిగారు.***

"..లేదు బావ్. నేస్తులం వచ్చేం..." చెప్పాడు రామ్మూర్తి.

"మీరు లాభం లేదు. బంధువులు రావాలి..." అనేశారు సిద్ధాంతి గారు. ఆశ్రమం గంట మ్రోగింది. సిద్ధాంతిగారు ఆసనం మీంచి లేచిపోయేరు. అక్కడి నుంచి నేరుగా, వశువుల సాలవైపు నడిచేరు. రామ్మూర్తీ, మిగిలిన జనమూ... ఆయన వెనకే నడిచేరు.

సాలవైపు నడిచిన వాడల్లా -ఆగి పోయి, చెవులు రిక్కించి, ఆనందంగా -

"ఒరే, ఒరే... కన్నయ్యా.. అదిగోరా... ఆవు వొచ్చేస్తోంది. అదిగో వాని... డెక్కల శబ్దం..." అని కేకేశారు.

కన్నయ్యా, జనమూ... దోవవైపు చూసేరు. ఏమీ కన్పించలేదు.అందరూ - సిద్ధాంతిగార్ని సానుభూతిగా చూసేరు.

ఇంతలో, సాలలో దూడ-యేదో శబ్దం గ్రహించి, కట్టుతాడు తెంపుకుని - వీధి తోవవైపు పరుగుతీసింది.

సిద్ధాంతి - పై నుంచి జరీ కండువా పారేసి, దూడ వెళ్ళిన వైపు - వడి వడిగా నడిచేరు. దోవ ఆ చివర... అరుస్తూ ఆవు కన్పించింది. దూడ పరుగెత్తుకుంటూ వెళ్లి - దాని కాళ్ల చుట్టూ గెంతులు వేయసాగింది. ఆవు - దాని ఒడలంతా నాలుకతో నాకుతోంది. వాటిని తోలుకుంటూ వచ్చిన వ్యక్తి-

"... చింతాడ సంత తోట అవతల మెరకల మీద దీన్ని కట్టేసి, యెవరో చంవబోతుంటే - అడ్డుకొని, తోలు కొచ్చేను.."

సిద్ధాంతి గారు - ఆ వ్యక్తికి చేతులెత్తి మొక్కారు.

ఎక్కడో విన్న గొంతులా వుందన్పిస్తే - గబ, గబా ముందుకు నడిచేను.. జనాన్ని తోసుకు!

నా గుండెలు ఆనందంతోనూ, బాధతోనూ గబ, గబా కొట్టుకున్నాయి.

"జనార్ధనా..." ఉద్వేగంతో పిలిచేను.

అందరూ ఆశ్చర్యంగా చూసేరు. రామ్మూర్తి... జనార్ధన్‌ని చుట్టుకు పోయేడు.

"..వస్తాను. ఆవు జాగర్త... పాడు లోకం..." సిద్ధాంతి గారికి చెప్పేసి, జనార్ధన్ వెళిపోబోయేడు.

నాకు మతిపోయింది.... జనార్ధన్ ప్రవర్తనతో! రామ్మూర్తి యేడుపెతుకున్నాడు.

వెళ్లబోతోన్న జనార్ధన్‌కి అడ్డంగా నిల్చుని -

"... తల్లినీ, భార్యనీ, బంధువుల్నీ... యెందర్నో యేడ్పించి - యెటో పలాయనమయిపోతావా?" ఇంకా, ఎన్నో ప్రశ్నల బాణాలు సంధించాలనుకున్నాను. గానీ, అవన్నీ గ్రహించిన వాడిలా జనార్ధన్, నా భుజమ్మీద చేయివేసి, నిమిరి -

***"... వలాయనమని నువ్వూ అనుకుంటున్నావా? ఒక్కోసారి, ప్రవాసమూ... యుద్ధ రహస్యమే. తెలుసా? ఏడ్వనిది.. యెవరు నేస్తం?"***

అప్పుడు - నా భుజమ్మీద వడిన జనార్ధన్ కన్నీటి చుక్క వెదుకులాడకుండానే - నా స్పర్శకొచ్చింది.

●


**1997 సంవత్సర మీ రాశి ఫలాన్ని ఫ్రీగా పొందండి**

మీ భవిష్యత్తు ఎలా ఉన్నది, ఏం జరుగనున్నది, ప్రత్యేకించి 1997 సంవత్సరము మీకు ఎలా ఉంటుంది. ఏ గ్రహము యొక్క ప్రభావము మీ పై ఎలా ఉంది, మీరు సంకల్పించిన పనులు ఎప్పుడు, ఎలా నెరవేరనున్నాయి మొద॥విషయాలు తెల్సుకోవాలనుకుంటున్నారా? మీ పేరు, రాశి జన్మ నక్షత్రం, మీకు ఇష్టమైన పువ్వు పేరు వ్రాసి పంపండి. అన్ని సమస్యలకూ పరిష్కారం లభించగలదు. వెంటనే ఉత్తరం వ్రాసి మీ భవిష్యత్తు ఫలాన్ని ఫ్రీగా పొందండి.

**SHIV SHAKTI JYOTISAALA**
(P.O.) LALBIGHA (GAYA) B/R.



**100% గ్యారంటీగా పంపుతాము**

6రౌండ్‌ల ఆటోమేటిక్ రివాల్వర్200షాట్స్, మరియు ఒక కేసు ఉచితం. పిక్నిక్, డ్రామా, ఫిలిం షూటింగ్, టూర్‌లకు ఉపయోగకారి. క్రూర జంతువుల బారి నుంచి తప్పించుకోవచ్చును. బ్రహ్మాండమైన ధ్వనితో పొగ వెదజల్లే రివాల్వర్. రేటు రూ. 255/-. పోస్టేజి, ప్యాకేజి రూ. 30/- అదనం: వి.పి.పి. ద్వారా పంపమని అడగండి. చిరునామా :

**SADHANA TRADERS (K/62)**
MAIRA BARITH (GAYA)